గౌతమ బుద్ధుడి బోధనలు ఆచరణీయం



గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

అత్తాపూర్‌: అత్తాపూర్‌ డివిజన్‌ ముష్కమహాల్‌ వద్ద గల హుడా కాలనీ పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని ఎమ్మెల్యే ప్రకాష్‌ గౌడ్‌ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గౌతమ బుద్ధుడి బోధనలు ఆచరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు శ్రీరాం రెడ్డి, స్థానిక నేతలు మున్సిపల్‌ డీసీ రవికుమార్‌, మున్సిపల్‌ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ పద్మావతి పాపయ్యయాదవ్‌

బండ్లగూడ: ప్రజల అవసరాలను తెలుసుకుని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్పొరేటర్‌ పద్మావతి పాపయ్యయాదవ్‌ అన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని 7వ డివిజన్‌ రాధానగర్‌ కాలనీలో 7 లక్షలతో, నర్సారెడ్డి కాలనీలో 35 లక్షలతో నూతన డ్రైనేజీ లైన్‌ పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సకాలంలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్ణచంద్రారెడ్డి, శ్రీధర్‌గౌడ్‌, రవీంద్రరెడ్డి, వల్లీ, నర్సింహ్మారెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మల్లేష్‌ మాస్టారుకు సన్మానం



మల్లేష్‌ మాస్టారును సన్మానిస్తున్న సామాజిక వేత్త జనార్దన్‌, విద్యార్థులు, ఉపాధ్యాయులు

శంషాబాద్‌ : పట్టణంలోని హుడా కాలనీ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాడిగా పనిచేసి అనేక అవార్డులు సాధించి ఇటీవల బదిలీ అయిన మల్లేష్‌ను సోమవారం హుడా పాఠశాలలలో ఘనంగా సన్మానించారు. సామాజిక వేత్త జనార్దన్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను శాలువాలతో సత్కరించి పాఠశాల స్మృతులకు సంబంధించిన ఫోటో ఫ్రేమ్‌ను అందజేశారు.

ఆలయాల్లో వసతులు కల్పించాలి



వినతి పత్రం ఇస్తున్న ప్రేమ్‌గౌడ్‌

మైలార్‌దేవ్‌పల్లి : బోనాల ఉత్సవాలకు మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని దేవాలయాలలో మౌళిక వసతులు కల్పించాలని డివిజన్‌ సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు ప్రేమ్‌గౌడ్‌ రాజేంద్రనగర్‌ ఉపకమీషనర్‌ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆదివారం జరుగబోవు బోనాల ఉత్సవాలలో మధుబన్‌ కాలనీ, కాటేదాన్‌, బాబుల్‌రెడ్డినగర్‌, మార్కండేయనగర్‌, గణేష్‌ నగర్‌ ప్రాంతాలలోని ఆలయాలలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సీసీ రోడ్లు, విద్యుత్‌ లైట్లు వేయాలని డీసీని కోరానన్నారు. అందుకు స్పందించిన కమిషనర్‌ అన్ని ఆలయాలలో బోనాల ఫండ్స్‌ మంజూరయ్యాయి, సీసీ రోడ్లు, విద్యుత్‌ లైట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాని తదితరులు ఉన్నారు.

డిపో మేనేజర్‌గా బద్రీ నారాయణ



రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ డిపో మేనేజర్‌గా సోమవారం ఫారూఖ్‌నగర్‌ డిపో నుంచి బదిలీపై వచ్చిన ఎస్‌.బద్రి నారాయణ పదవీ బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా ఇప్పటి వరకు రాజేంద్రనగర్‌ డిపో మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనాథ్‌ బదిలీపై నల్గొండ డిపోకు వెళ్లారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌.బద్రినారాయణను ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు.

విద్యార్థులు చక్కగా చదువుకోవాలి

బండ్లగూడ: విద్యార్థులు చక్కగా చదువుకుని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. హైదర్షాకోట్‌ హై స్కూల్‌లో నిర్మన్‌ సంస్థ వారు హ్యాండ్‌ వాష్‌, వాష్‌ రూమ్‌లు, ఆడిటోరియం నిర్మించడానికి ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించేందుకు, మెరుగైన వసతులు కల్పించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్‌ పూలపల్లి రాజేందర్‌రెడ్డి తదితరులు

సత్ఫలితాలిస్తున్న వన మహోత్సవం

- అందుబాటులో 1.70 లక్షల మొక్కలు
- ఆహ్లాదకరమైన వాతావరణం దిశగా అడుగులు



బండ్లగూడ: వనాలు పెంచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మైత్రీ కాలనీలో ఏర్పాటు చేసిన నర్సరీ సత్ఫలితాలను ఇస్తోంది. నర్సరీలలో పెంచిన మొక్కలు కురుస్తున్న వర్షాలకు ఏపుగా పెరిగి నాటేందుకు సిద్ధమయ్యాయి. గండిపేట్‌ మండలం బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఖాళీగా ఉన్న పార్కులు, ప్రభుత్వ స్థలాలు చెరువు, కుంట గట్లపై ఉన్న ఖాళీ స్థలాలు, ప్రభుత్వ పాఠశాలలు, పట్టణ ప్రకృతి వనాలు, పలు కాలనీలలోని రోడ్ల ప్రక్కన ప్రధాన రహదారి పొడువునా మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించి మొక్కలు నాటుతున్నారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధి కిస్మత్‌పూర్‌లోని మైత్రీకాలనీ ఈసీ వాగు సమీపంలో నీరు ఉండి అనువైన 1.10 ఎకరం ప్రభుత్వ స్థలంలో మొక్కలు పెంచేందుకు అనువైన స్థలం తీసుకొని గత రెండేళ్లుగా మైతీ కాలనీలో మొక్కలు పెంచుతున్నారు.

నీరు పోసేందుకు ప్రత్యేక సిబ్బంది..

ఈ సంవత్సరంలో ఏర్పాటు చేసిన మైత్రి కాలనీలోని నర్సరీలో 1.70 లక్షలకు పైగా మొక్కలను పెంచారు. అందులో పూలు, పండ్ల మొక్కలు 66 వేల వరకు ఇంటింటికి పంపిణీ చేసేవి. మిగితా మొక్కలు అవేన్యూ ప్లాంటేషన్‌ రోడ్డు పక్కలా, పార్కులలో పెట్టడానికి ఉపయోగిస్తారు. ఇప్పటి వరకు 50 శాతం మొక్కలను పంపిణీ చేశారు. నర్సరీలో పైపులైను వ్యవస్థను ఏర్పాటు చేసి, గార్డులతో మొక్కల పర్యవేక్షణ బాధ్యత చేపడుతున్నారు. మొక్కలకు నీరు పోసేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈ నర్సరీలో పూల మొక్కలు మందారం, గులాబీ, ఎర్రరోజ్‌, తెల్ల రోజ్‌, టేబుల్‌ రోజ్‌ ఎల్లో, రెడ్‌, నూరు వరహాలు, సీతాఫలం, చైనా బాదం, నీడనిచ్చే మొక్కలు వేప, కానుగా, కాంగో, కార్పస్‌ తోపాటు చింత,జామ నేరేడు,టేకు తదితర మొక్కలను పెంచుతున్నారు.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి..



రాష్ట్ర ప్రభుత్వం మొక్కలు నాటడాన్ని ఒక పండుగలా చేయాలని సంకల్పంతో వనమహోత్సవం పేరుతో కార్యక్రమం చేపట్టింది. మొక్కల పెంపకం పైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉంది. మొక్కలు నాటడం అందరి బాధ్యతగా గుర్తించాలి. చెట్లు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో వర్షాలు కూడా అధికంగా కురుస్తాయి. కార్పొరేషన్‌ పరిధిలోని ప్రజలందరు ఇంటికో మొక్కను నాటి సంరక్షించాలి.

- మద్దెల లతా ప్రేమ్‌గౌడ్‌, బండ్లగూడ జాగీర్‌ మేయర్‌

నాటిన ప్రతి మొక్కనూ కాపాడుతాం..



పచ్చదనం పెంచేందుకు, పర్యావరణాన్ని కాపాడేందుకు కార్పొరేషన్‌ పరిధిలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షిస్తాం. గతంలో నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం సంతరించుకున్నాయి. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి.

- శరత్‌చంద్ర, కమిషనర్‌

విద్యార్థులకు చేయూతనందించేందుకు ముందుకు రావాలి



విద్యార్థులకు స్కూల్‌ బ్యాగ్స్‌, స్టేషనరీ సామాగ్రీ అందజేస్తున్న స్వామిగౌడ్‌ తదితరులు

బండ్లగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించేందుకు తమవంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందించేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర మాజీ శాసన మండలి చైర్మన్‌ స్వామిగౌడ్‌ అన్నారు. నిరుడు విట్టలయ్య ముదిరాజ్‌ 8వ వర్ధంతి సందర్భంగా కిస్మత్‌పూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్‌ బ్యాగులు, స్టేషనరీ సామాగ్రి, షూస్‌ తదితర వస్తువులను పంపిణీ చేశారు. నిరుడు విట్టలయ్య కుమారులు నిరుడు పోచయ్యముదిరాజ్‌, మాజీ సర్పంచ్‌ శ్రీశైలంముదిరాజ్‌, మాజీ ఉపసర్పంచ్‌ శేఖర్‌ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అంతకు ముందు కిస్మత్‌పూర్‌లోని అనాథాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ ప్రతినిధి లంకల సంగారెడ్డి, సర్పంచ్‌ సదానంద్‌, కోఆప్షన్‌ సభ్యులు జగదీష్‌, గ్రామ పెద్దలు శ్రీరాములు, స్వామి, విట్టలయ్య, నర్సింహ్మా, రాజుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం: డీసీ

రాజేంద్రనగర్‌: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటిని పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్‌ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ రవికుమార్‌ అన్నారు. సోమవారం సర్కిల్‌ కార్యాలయంలో 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొని ప్రజల ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీసీ రవి కుమార్‌ మాట్లాడుతూ... ప్రజావాణిలో మొత్తం 5 ఫిర్యాదులు అందాయని, ఇందులో ఇంజనీరింగ్‌ విభాగంలో నాలుగు ఫిర్యాదులు, టౌన్‌ ప్లానింగ్‌ విభాగంలో ఒక ఫిర్యాదు అందిందన్నారు. ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులకు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం



అత్తాపూర్‌: భూ కబ్జాదారులు ఎంతటి వారైనా ఉపేక్షించే సమస్య లేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బాధితులు ఎవరైనా నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని అత్తాపూర్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్‌ ఎలివేటెడ్‌ వే 207 పిల్లర్‌ నంబర్‌ అక్బర్‌హిల్స్‌ ప్రాంతంలో సుమారు 660 గజాల 6 కోట్ల రూపాయల విలువైన భూమిని కబ్జా చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. శనివారం అర్ధరాత్రి అక్బర్‌ హిల్స్‌ ప్రాంతంలోకి వెళ్లి చూడగా కబ్జా ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకున్న టోలిచౌకికి చెందిన మహమ్మద్‌ ఫక్రుద్దీన్‌(35), కిషన్‌ బాగ్‌ ప్రాంతానికి చెందిన మహ్మద్‌ సమాద్‌(33), ల్యాండ్‌ గ్రాఫర్లు 9 మంది యువకులను ఉపక్రమించారు. మహ్మద్‌ సోయల్‌(20), శ్రీకాంత్‌(28), సయ్యద్‌ ఇర్ఫాన్‌(27), మహ్మద్‌ ఇర్షాద్‌(27), మహ్మద్‌ ముస్తఫా(20), మహ్మద్‌ హుస్సేన్‌ ఖాన్‌(44), లిఖిత్‌ హైమద్‌ (22), ఇమ్రాన్‌ అలీ ఖాన్‌(34), అబ్దుల్‌ రెహమాన్‌(37), వీరిని అదుపులోకి తీసుకుని సోమవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించారు. రోజు కూలీలుగా ఈ తొమ్మిది మంది 2000 రూపాయలకు కూలీ పనిచేస్తూ మారణాయుధాలతో స్థానికంగా సంచరిస్తూ విలువైన స్థలాలలో నిర్మాణాలు చేపట్టే భూ కబ్జాదారులకు అందజేస్తారు. వీరి నుండి వేట కోడవళ్లు, నాటు తుపాకీ, గొడ్డలితో పాటు మటన్‌ చాకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మణికొండ మున్సిపల్‌ మేనేజర్‌గా శ్రీధర్‌



మేనేజర్‌ శ్రీధర్‌కు స్వాగతం పలికిన మణికొండ మున్సిపాలిటీ సిబ్బంది

మణికొండ: సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్‌ మేనేజర్‌ బి.శ్రీధర్‌ మణికొండ మున్సిపాలిటీ మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. మణికొండలో పనిచేస్తున్న రమేష్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదిబట్ల మున్సిపాలిటీకి బదిలీ చేసింది. దీంతో సోమవారం మున్సిపల్‌ మేనేజర్‌గా శ్రీధర్‌ పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు బిల్‌ కలెక్టర్‌లు, టౌన్‌ప్లానింగ్‌, అకౌంట్స్‌, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారించే దిశగా కృషి చేస్తానన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమను నేరుగా సంప్రదించాలని ఆయన కోరారు.

పాఠశాలలో హంగామా సృష్టించిన పలువురి అరెస్ట్‌



అరెస్ట్‌ అయిన విద్యార్థి సంఘాల నాయకులు

రాజేంద్రనగర్‌: తెలంగాణ లీగల్‌ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ ప్రతినిధులమంటూ పాఠశాలలో దూరి హంగామా సృష్టించిన వారిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ వివరాల ప్రకారం.. కాటేదాన్‌ వేంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్‌ హై స్కూల్‌లో కొంతమంది విద్యార్థి సంఘం నాయకులమంటూ వచ్చి పుస్తకాలు అమ్ముతున్నారు.. ఎక్కువ ఫీజులు తీసుకుంటున్నారంటూ రూ. 3 లక్షలు డిమాండ్‌ చేశారు. దాదాపుగా 15 మంది వచ్చి మూడు గంటల వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాన్ని భయభ్రాంతులకు గురి చేశారు. పాఠశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు బెదిరింపులకు గురి చేసి డబ్బు డిమాండ్‌ చేసిన 13 మందిలో ఐదుగురిని గుర్తించి అరెస్ట్‌ చేశామని మిగతా వారి కోసం గాలిస్తున్నామన్నారు. కార్తీక్‌ అలియాస్‌ బాలకోటి, సందీప్‌, లక్ష్మీకాంత్‌ చారి, ప్రవీణ్‌ యాదవ్‌, ప్రణయ్‌ గౌడ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు.

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన సాన్వీ



పతకాలు సాధించిన సాన్వీని అభినందించిన అతిథులు

మణికొండ: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో జరిగిన అండర్‌ 11 గర్ల్స్‌ సింగిల్స్‌ విభాగంలో మణికొండ మ్యాచ్‌ పాయింట్‌ బ్యాడ్మింటన్‌ అకాడమీ విద్యార్థిని సాన్వీ లట్టాల అద్భుతమైన ఆటతీరుతో రాణించి బంగారు పథకాన్ని సాధించిందని అకాడమీ ఫౌండర్‌, చైర్మన్‌ వేణు ముప్పాల తెలిపారు. సోమవారం జరిగిన సెమీఫైనల్స్‌ మ్యాచ్‌లో నదియా పా 30/16 పాయింట్ల ఆధిక్యతతో రాణించిందన్నారు. ఫైనల్స్‌లో జయశ్రీ పై 30/05 పాయింట్ల తేడాతో గెలిచి బంగారు పథకం అందుకుందన్నారు. అండర్‌ 13 డబుల్స్‌ విభాగంలో జ్యోత్స్నతో కలిసి 30/27 స్కోరుతో హిమశ్రీ, మోక్షశ్రీల జోడీని ఓడించి పథకం సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు బ్యాడ్మింటన్‌ అసోసియేషన్‌ ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాగర్‌, సీఈఓ సూరిబాబు, సాంబమూర్తిలు ట్రోఫీతో పాటు సర్టిఫికేట్‌లను అందించారన్నారు. ఈ గెలుపులతో ఆమె త్వరలోనే జరిగే రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికయ్యిందని, మరో పథకాన్ని సాధించేందుకు సిద్ధంగా ఉందని వేణు తెలిపారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కులను సోమవారం నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ లబ్ధిదారులకు అందజేశారు. పీరంచెరువు ప్రాంతానికి చెందిన ఎండి నాజీర్‌కు 54 వేలు, హిమాయత్‌సాగర్‌కు చెందిన బాలునాయక్‌కు రూ.25 వేలు, కిస్మత్‌పూర్‌ ఇందిరమ్మ కాలనీకి చెందిన బాలమణికి రూ.25 వేల రూపాయల చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో లబ్ధిదారులకు చెక్కులు అందించేందుకు ఆలస్యమైందన్నారు. ఎన్నికల కోడ్‌ కారణంగా జాప్యం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేలా కృషి చేస్తానని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గోకరి సురేష్‌గౌడ్‌, చేగూరి రాజు, రజాక్‌, సాదిక్‌, హెచ్‌.రాజు, శ్రీనాథ్‌, మహేష్‌ తదితరులున్నారు.

కమ్యూనిటీహాల్‌కు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించండి



వినతి ప్రతం అందజేస్తున్న కార్పొరేటర్‌ సాగర్‌గౌడ్‌

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 20వ డివిజన్‌లో నూతన కమ్యూనిటీహాల్‌ భవనం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కార్పొరేటర్‌ సాగర్‌గౌడ్‌ సోమవారం గండిపేట మండల తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలోనే కమ్యూనిటీహాల్‌ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. కానీ ప్రభుత్వ స్థలం లేకపోవడంతో పనులు జరగలేదని, నిధులు నిర్మాణానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇదే విషయాన్ని గతంలో సైతం కమీషనర్‌, తహసీల్దార్‌లకు విన్నవించామన్నారు. కమ్యూనిటీహాల్‌ నిర్మాణం జరిగితే ఓపెన్‌ జిమ్‌, ఆసుపత్రి, మహిళా భవన్‌, అంగన్‌వాడీ సెంటర్‌, మహిళా సంఘాల కోసం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందించామని ఆయన సానుకూలంగా స్పందించారని తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

రోడ్డు సమస్యను పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌



రోడ్డు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌, నాయకులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ విష్ణేశ్వర కాలనీ రోడ్డును రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్‌ సోమవారం పర్యటించి పరిశీలించారు. నూతనంగా నిర్మించిన మున్సిపల్‌ కార్యాలయం పక్క నుంచి దారి ఉండేదని కానీ అది ఇప్పుడు ప్రభుత్వ అధికారులు మున్సిపల్‌ కార్యాలయంకు కేటాయించిన స్థలంలోకి వస్తుందని తెలుపుతున్నారని స్థానికులు అన్నారు. నాలుగు రోజుల క్రితం చుట్టూ ఫెన్సింగ్‌ వేసి రోడ్డును మూయించారని, దీంతో తాము ఎంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి విన్నవించడంతో ఆయన సోమవారం వచ్చి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ మాట్లాడుతూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కాలనీ వాసులు సైతం ఎమ్మార్వోను కలిసి విజ్ఞప్తి చేయాలన్నారు. సమస్య త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ సాగర్‌గౌడ్‌, గోకరి సురేష్‌గౌడ్‌ అంతారం నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.

బోనాలకు భారీ ఏర్పాట్లు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్‌ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: వచ్చే ఆదివారం జరిగే బోనాల ఉత్సవాల నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమీషనర్‌ బి.శరత్‌ చంద్ర తెలిపారు. సోమవారం ఉదయం 14,17వ డివిజన్‌లలోని పీరంచెరువు ఓల్డ్‌ విలేజ్‌, వెంకటేశ్వర కాలనీలలో ఆలయాల వద్ద అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో రోడ్లకు ఇరువైపుల పెరుకుపోయిన చెత్తను, మట్టి కుప్పలు, పిచ్చి మొక్కలను తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా ఆనందోత్సవాల మధ్య బోనాల పండుగను జరుపుకోవాలన్నారు. ఎలాంటి అసౌకర్యాలు లేకుండా తగు అభివృద్ధి పనులను చేస్తున్నామన్నారు. ఇప్పటికే గోతులమయంగా మారిన రోడ్లకు ప్యాచ్‌వర్క్‌ పనులను చేశామన్నారు. పారిశుద్ధ్య కార్మికులు దేవాలయాల వద్ద నిత్యం పరిశుభ్రత కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, శానిటరీ జవాన్లు సుభాష్‌, సురేష్‌, శ్రీధర్‌, రాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచడం మన బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, కౌన్సిలర్లు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట 14వ వార్డులో సోమవారం కౌన్సిలర్‌ ఆదిత్యారెడ్డితో కలిసి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌ ఇంటింటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మన ఇంటితో పాటు కాలనీ, వార్డు, మున్సిపాలిటీ పరిధిలో వీలైనన్ని ఎక్కువగా మొక్కలను పెంచాలని, ప్రజల సంఖ్యకు అనుగుణంగా మొక్కలను పెంచితేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుకే ప్రతీ వార్డులలో ప్రతి ఇంటికి అవసరమైన మొక్కలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి



తహసీల్దార్‌ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మణికొండ: కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా ఎన్నికలలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు అప్ప ఆధ్వర్యంలో గండిపేట తహసీల్దార్‌కు వారి డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి. అంజన్‌కుమార్‌ గౌడ్‌, ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్పలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీసీ డిక్లరేషన్‌లో భాగంగా ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీల కులగణన చేసి బీసీ కమీషన్‌ ఆధారంగా రిజర్వేషన్లను పెంచుతామన్నారని వారు గుర్తు చేశారు. ఎంబీసీ కులాలకు ప్రత్యేక సంక్షేమ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయలేదని, అన్ని బీసీ కులాల సమగ్ర అభివృద్ధికి కార్పొరేషన్లు ఏర్పాటు చేసి యువతకు చిరువ్యాపారాలు నిర్వహించుకునేందుకు, ఉన్నత విద్యకు వడ్డీ లేకుండా, ఎలాంటి పూచీకత్తు లేకుండా రూ. పది లక్షల రుణాలు ఇస్తామని వాటిని పట్టించుకోవటం లేదన్నారు. ర్యాంక్‌తో సంబంధం లేకుండా మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్‌, మత్స్య సంఘాలకు చేపపిల్లల పంపిణీ చేయలేదని, ముదిరాజ్‌, గంగపుత్ర, గౌడ్‌ మున్నూరుకాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక సమాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఎలాంటి హామీలను నెరవేర్చలేక పోయినందుకు తమ పార్టీ తరఫున నిరసన తెలియజేస్తున్నామన్నారు. త్వరలోనే కాంగ్రెస్‌ ప్రభుత్వం స్పందించి హామీలను నెరవేర్చకపోతే జిల్లా కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, నిరసన దీక్షలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ కె. నరేందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బిక్షపతియాదవ్‌, మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు సి.బీరప్ప, మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధ్యక్షుడు మహేష్‌యాదవ్‌లతో పాటు నాయకులు, కౌన్సిలర్‌లు, కోఆప్షన్‌ సభ్యులు పాల్గొన్నారు.